క్లుప్తంగా

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత



పొదలకూరు: ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందిన పట్టణంలోని టైలర్స్‌కాలనీ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు చేబోలు శ్రీనివాసులు కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమ సంఘం సోమవారం నగదు అందజేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి చేతులమీదుగా ఉపాధ్యాయుడి కుటుంబసభ్యులకు రూ.1.25 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి గ్రామోత్సవం



ముత్తుకూరు: కనుమ పండగ సందర్భంగా మండలంలోని కృష్ణపట్నంలో ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గోపూజ చేశారు. రైతులు పశువులను పూజించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామికి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా గొబ్బెమ్మ నిమజ్జనం



గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో సోమవారం అత్యంత వైభవంగా గొబ్బెమ్మ నిమజ్జన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని శ్రీరామమందిరం నుంచి ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎస్సీకాలనీలో గొబ్బెమ్మ నిమజ్జన మహోత్సవంలో భాగంగా పొంగళ్లు పెట్టుకున్నారు.

ద్విచక్ర వాహనం అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీసీబీ ప్రవేశపెట్టిన సహకార చక్ర పథకంలో భాగంగా ద్విచక్ర వాహనాన్ని బ్యాంక్ ఉద్యోగి కుమార్‌కు సోమవారం అందజేశారు. నగరంలోని బజాజ్ షోరూమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు మాట్లాడారు. వాహనాల కొనుగోలు కోసం 80 శాతం రుణాన్ని బ్యాంక్ అందజేయ నుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. బ్యాంక్ మేనేజర్ రాజా, ఫీల్డ్ ఆఫీసర్ విజిత, రఘురామయ్య, సత్యనారాయణ, సుకుమార్, లిఖిత, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా పతంగుల ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన సమీపంలో గల గణేష్ ఘాట్ వద్ద గాలిపటాల ప్రదర్శనను సింహపురి సంక్రాంతి ఉత్సవ సమితి, ఆంధ్రప్రదేశ్ కైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి ప్రారంభించారు. గాలిపటాలను వందలాది మంది ఎగురవేశారు. ఉత్సవ సమితి నిర్వాహకులు రంగరాజన్, మిడతల రమేష్, హర్షవర్ధన్, కిరణ్‌కుమార్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. నెల్లూరు సౌత్‌ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. కావలి నుంచి గూడూరు వైపు అతి వేగంగా వెళ్తున్న ఓ కారు గుర్తుతెలియని వ్యక్తిని బుజబుజనెల్లూరులోని జాతీయ రహదారిపై ఈ నెల ఐదున ఢీకొంది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు

- స్వగ్రామాలకు వచ్చిన వారితో కళకళలాడిన పల్లెలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కనుమ సందర్భంగా పశువులను పూజించిన రైతులు



తోటపల్లిగూడూరు: మాచర్లవారిపాళెంలో ముగ్గుల పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులు



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో గోవుకు ప్రసాదం తినిపిస్తున్న దృశ్యం



ఇందుకూరుపేటలో లక్ష్మీనరసింహస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

తోటపల్లిగూడూరు: సంక్రాంతి, కనుమ పండగలను ఆది, సోమవారాల్లో ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. పెద్ద పండగ అని పిలుచుకునే సంక్రాంతి పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కనుమ పండగ సందర్భంగా పాడి రైతులు గోవులకు, పశువులకు ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి పండగకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారితో పల్లెలు సందడిగా కనిపించాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇంటి ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్ గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో పాపిరెడ్డిపాళెంలో, ఎన్‌డీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో మాచర్లవారిపాళెంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మాచర్లవారిపాళెంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎన్‌డీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత నాయుడు ఆదికేశవులురెడ్డి పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఎన్‌డీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత నాయుడు ఆదికేశవులురెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కనుమ వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతి, కనుమ పండగలను ఆది, సోమవారాల్లో మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కనుమ పండగ సందర్భంగా సోమవారం మండలంలోని జొన్నవాడలో శ్రీమల్లికార్జునస్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయంలోని గోశాలలో ఉన్న గోవులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గోవులకు పండ్లు, ప్రసాదాలు తినిపించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో పశుపోషకులు కనుమ సందర్భంగా పశువులను పూజించారు.

విడవలూరులో..

మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం కనుమ పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాడి రైతులు వారి పశువులు, గోవులను శుభ్రం చేసి అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

పల్లెల్లో వేడుకగా..

పొదలకూరు: గ్రామాల్లో పాడి రైతులు సోమవారం కనుమ పండగను వేడుకగా నిర్వహించారు. పాడి పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించారు. రైతులకు ముఖ్యమైన కనుమ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో పాడిరైతులు ఘనంగా జరుపుకున్నారు. గోవులు, గేదెలు, వ్యవసాయ పనులకు ఉపయోగించే ఎద్దులను అలంకరించి పూజలు చేశారు.

ఇందుకూరుపేట మండలంలో..

ఇందుకూరుపేట: సంక్రాంతి, కనుమ పండగలను ఆది, సోమవారాల్లో మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. ఆటలు, పాటలు, ముగ్గులు పోటీలతో సందడి చేశారు. ఆటల పోటీల విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కనుమ పండగ సందర్భంగా పాడి రైతులు పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించి పూజలు చేశారు.

ఆలయాల్లో విశేష పూజలు

సంక్రాంతి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తోట ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఇందుకూరుపేట నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి, మల్లేశ్వరస్వామి, పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, వీరభద్రస్వామి, కొత్తూరు నుంచి వీరాంజనేయస్వామి, గంగమ్మ, చంద్రమౌళీశ్వరుడు, శ్రీరామచంద్రుడు, మల్లేశ్వరస్వామి ఉత్సవంగా బయలుదేరి పాఠశాల ఆవరణకు చేరుకొన్నారు. భక్తులు స్వాములు, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో కొత్తూరులో కోలాహలం నెలకొంది. అర్చకులు రంగాచార్యులు, మణిశంకర్, రంగబాబు, నందికిషోర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. రావూరులోని శ్రీకృష్ణాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

వాలీబాల్ విజేత యల్లాయపాళెం జట్టు



విజేత జట్టుతో నిర్వాహకులు

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం పాత ఎస్సీకాలనీలో కె.తిరుపతి జ్ఞాపకార్థం వైపీఎం యూత్ ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతి ఫ్రెండ్స్, యల్లాయపాళెం జట్టు విజేతగా నిలిచింది. కొడవలూరు బాయ్స్, యల్లాయపాళెం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కంజి గోవిందయ్య, సుజాతమ్మ, చింతా కల్పన, ఆదిత్య, అశ్వంత్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ఆటల పోటీలు



రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం అరుంధతీయవాడలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సనుమూరు చరణ్ మెమోరియల్ ఆటల పోటీలు ఆది, సోమవారాల్లో నిర్వహించారు. చెడుగుడు, వాలీబాల్, రంగవల్లులు, షటిల్, లాంగ్ జంప్, కుర్చీలాట, పరుగుపందెం, తాడులాగే పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. బహుమతులు ప్రదానం చేసిన వారిలో సీపీఎం నాయకులు గోనె దయాకర్, వడ్లమూడి నరసయ్య, షేక్ మాబు, భూలోకం కాంతారావు, తల్లు శీనయ్య, పోతుగుంట పరశురామయ్య ఉన్నారు.

బండిలాగుడు పోటీల విజేత వెంకటేశ్వరపురం



విజేత ఎడ్ల యజమానికి నగదు అందజేస్తున్న సర్పంచ్ పెంచలయ్య

బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని పెనుబల్లిలో సోమవారం రాత్రి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి బండిలాగుడు పోటీల్లో వెంకటేశ్వరపురానికి చెందిన బాల నరసింహారెడ్డి ఎడ్లు విజేతగా నిలిచాయి. విజేత ఎడ్ల యజమానికి సర్పంచ్ ఓడా పెంచలయ్య చేతులమీదుగా రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. 2, 3, 4, 5 స్థానాల్లో నిలిచిన అల్లూరు మండలం తూర్పుగోగులపల్లికి చెందిన ఎడ్లు, ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెంకు చెందిన ఎడ్లు, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడకు చెందిన ఎడ్లు, కొడవలూరు మండలంలోని రామన్నపాళేనికి చెందిన ఎడ్ల యజమానులు వెంకటసుబ్బారెడ్డి, అంకయ్య, నాగరాజు, రోహితరెడ్డిల నగదు బహుమతులు అందజేశారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ విజేత జట్టు కోలాహలం

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడులో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన కాకాణి రమణారెడ్డి మెమోరియల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం ఎనిమిది టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా సోమవారం ఉదయం సెమీ ఫైనల్, మధ్యాహ్నం ఫైనల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో తిక్కవరప్పాడు హరిజనవాడ జట్టు విజయం సాధించింది. క్రికెట్, వాలీబాల్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేయనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకుడు నలగర్ల వెంకటరమణయ్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ మహోత్సవం



నేలటూరులో పూజలు చేస్తున్న పశుపోషకులు

ముత్తుకూరు: కనుమ పండగను సోమవారం పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటున్న పశువులకు పూజలు చేశారు. పశువుల పాకలను శుభ్రం చేసి ముగ్గులతో అలంకరించారు. గేదెలు, ఆవులు తదితర పశువులకు స్నానాలు చేయించి పసుపు–కుంకుమ, రంగులతో అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టుకొని పశువులకు తినిపించారు. ముత్తుకూరు, కృష్ణపట్నం, నేలటూరు, ఈపూరు, బ్రహ్మదేవి, పొట్టెంపాడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో గోపూజ నిర్వహించారు.

మంత్రి కాకాణితో దొడ్డంరెడ్డి



కోవూరు: రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా నియమితులైన దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతోపాటు మంత్రిని పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కోవూరు ఏఏబీ చైర్మన్ నిలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, కోవూరు వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, కోవూరు మండల బీసీ సెల్ అధ్యక్షుడు కేత మల్లికార్జున్ తదితరులు కలిశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొడవలూరు: గంజాయి, నాటుసారా లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ సీఐ ఆర్.నరహరి సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై మండలంలోని యల్లాయపాళెం ఎస్సీకాలనీలో సోమవారం యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా నాటుసారా తయారీ చేస్తున్నా, విక్రయాలు జరుపుతున్నా తమకు సమాచారం అందించాలని, 14500 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్‌చేయాలని తెలిపారు. నాటుసారా, గంజాయి లేని సమాజం కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొడవలూరు మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారీ చేస్తున్నా, విక్రయిస్తున్నా, గంజాయి విక్రయిస్తున్నా 9440902524 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఎస్ఈబీ ఎస్సై డి.శ్రీధర్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెలను తప్పించబోయి ఆటో బోల్తాపడడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన కసుమూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. నెల్లూరుకు చెందిన సుబ్రహ్మణ్యం, వెంకటేష్ పనినిమిత్తం ఆటోలో కసుమూరుకు వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కసుమూరు మలుపురోడ్డు వద్ద గేదెలు అడ్డురావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం, వెంకటేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): కనుమను పురస్కరించుకొని రంగనాయకులపేట, గోపురంవీధి, సంతపేట, తదితర ప్రాంతాల్లో పేదలు, తదితరులకు ఆహార పొట్లాలను చంద్ర ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. అల్లూరుకు చెందిన సత్యనారాయణ, అశోక్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేదలు, వృద్ధులకు దుప్పట్లు, ఆహార పొట్లాలను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పంపిణీ చేశారు. ఏవీకే ఫౌండేషన్, కృపాదరణ మినిస్ట్రీస్ సహకారంతో 120 మందికి వీటిని అందజేశామని పేర్కొన్నారు.

కామాక్షితాయి సేవలో ప్రముఖులు



కామాక్షితాయిని దర్శించుకున్న సతీష్‌రెడ్డి కుటుంబసభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని సోమవారం ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ ఆదివారం సంక్రాంతి పండగ సందర్భంగా రక్షణశాఖ సలహాదారు జి.సతీష్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకోగా, డీఐజీ రాజశేఖర్ బాబు, సోమవారం నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తమ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను మరువరాదు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా మహిళలకు సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని డీసీఏడీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. ఆదివారం కోవూరులోని తూర్పు ఎస్సీకాలనీలో మహిళలు, చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్, నాయకుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇనమడుగులో..

మండలంలోని ఇనడమడుగు గ్రామంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఎయిత్ వండర్ యూత్ పర్యవేక్షణలో సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ యశోధర పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో మహిళా బ్యాంకు సీఈఓ గునుపాటి ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధీర్‌రెడ్డి, టీఎస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముత్తుకూరు: విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని మన్మధరావుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ భవానమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ పూండ్ల అచ్యుత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో..

బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు, యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అధ్యక్షుడు శ్రీనివాసులు, కోటయ్య, దుర్గాప్రసాద్, సతీష్, పెంచలయ్య, సాయి, చైతన్య, శంకర్ పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు

ముత్తుకూరు: ముత్తుకూరులో సోమవారం మండలస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంతూరు–వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 30 మంది మహిళా బృందాలు పాల్గొన్నాయి. పోటీలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. పిల్లలకు పతంగులు పంపిణీ చేశారు. ఈ పోటీలకు జోతిష్యమణి డాక్టర్ మురళీకృష్ణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు కుప్పం నరసింహారావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చందా వెంకటస్వామి, జిల్లా ఇన్‌చార్జి పేర్ల సుప్రజ, కోఆర్డినేటర్ గుడివాడ ఉమామహేశ్వరావు, రీజనల్ చైర్మన్ పేర్ల సత్యనారాయణ, జోన్ చైర్మన్ పేర్ల కృష్ణవేణి, క్లబ్ అధ్యక్షుడు చందా వెంకటేశ్వర్లు, కార్యదర్శి చెక్కా శ్రీనివాసులు, కోశాధికారి కనిశెట్టి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

పొదలకూరు: పట్టణంలోని సాయిబాబా మందిర ప్రాంగణంలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు డక్కిలి ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వి.బుజ్జమ్మ, ఎస్.కల్యాణి, యు.శ్రీలేఖ నిలిచారు. నారాయణరెడ్డి, లక్ష్మీదుర్గ, హరిత న్యాయనిర్ణేతలుగా వ్యహరించారు. కార్యక్రమంలో బాబా మందిర సేవా సమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామదరావు, కోశాధికారి సుబ్బానాయుడు, సంయుక్త కార్యదర్శి తరుగు ప్రభాకర్, సభ్యులు లక్కాకుల ఆనందరావు, కె.కోటేశ్వరరావు, తుమ్మల శ్రీనివాసులు, కదిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న దృశ్యం



పొదలకూరు: విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

నేత్రపర్వంగా పార్వేట ఉత్సవం



గోపూజ



పెద్ద శేషవాహనంపై కొలువైన రంగనాథుడు

నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనం, పేట ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి పేట ఉత్సవం, రంగనాథస్వామికి పెద్ద శేషవాహనంపై పార్వేట ఉత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

- కనుమను పురస్కరించుకొని నగరంలోని రంగనాథుడి దేవస్థానంలో గో పూజను సోమవారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.